# రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు


నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు

● వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు నిరసన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోని మహిళలకు రక్షణ కరువైందని శ్రీకాకుళం రూరల్ జెడ్పీటీసీ రుప్ప దివ్య, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం శ్రీకాకుళం నియోజకవర్గ అధ్యక్షురాలు మూకళ్ల సుగుణమ్మ, శ్రీకాకుళం రూరల్ ఎంపీపీ అంబటి నిర్మల, టి.కామేశ్వరిలు మండిపడ్డారు. శ్రీకాకుళం నగరంలో సూర్యమహల్ కూడలి వద్ద కూటమి నేతల అరాచకాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలు, మైనర్ బాలికలు, చిన్నారులు అనే తేడా లేకుండా కూటమి నేతలు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేయడం సరికాదన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జెడ్పీటీసీ సభ్యురాలు హారికపై దాడి చేయడం హేయమైన చర్యని మండిపడ్డారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల రక్షణ కోసం దిశ వంటి చట్టాన్ని తీసుకొచ్చారని, అయితే ఆ చట్టాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని దుయ్యబట్టారు. అధికార దురహంకారంతో కూటమి నేతలు అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

**మూల్యం చెల్లించుకోక తప్పదు**

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి గాలికొదిలేసి పూర్తిగా కక్ష సాధింపులు చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇటీవల నెల్లూరులో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై దాడి చేయడంతో పాటు, వాళ్ల అమ్మగారిని భయభ్రాంతులు గురిచేసిన తీరు చూస్తే మహిళలపై ఎంత గౌరవం ఉందో తెలుస్తోందన్నారు. కూటమి ఏడాది పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. హారికపై జరిగిన దాడికి నిరసనగా రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసిన మహిళా నాయకులకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దందు శార్వాణి, సర్పంచ్ చిట్టి లలిత, బోర కృష్ణవేణి, బానాల దమయంతి, రావాడ ధరణి తదితరులు పాల్గొన్నారు.

## అభ్యంతరాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

● ఆర్డీవో సాయి ప్రత్యూష


మాట్లాడుతున్న ఆర్డీవో సాయిప్రత్యూష

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల జాబితాల ఆధునికీకరణ అవసరమని, ప్రతిఏటా ఈ ప్రక్రియ జరుగుతున్నప్పటికీ తగు జాగ్రత్తలు తీసుకొని క్లయిమ్స్, అభ్యంతరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష సూచించారు. ఎన్నికల సంఘం, ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు రెవెన్యూ గెస్ట్ హౌస్ సమావేశ మందిరంలో జరుగుతున్న బీఎల్‌వోల శిక్షణలో సోమవారం పాల్గొన్నారు. దీనిలో భాగంగా ఓటర్ల జాబితా నిర్వహణ, క్లెయిమ్స్, అభ్యంతరాలు, బీఎల్‌వో అప్లికేషన్ వినియోగం, వెబ్‌సైట్ వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జీకే శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ ఎస్.చక్రవర్తి, ఏఈఆర్‌వో జానకి, రాజశేఖర్ తదితర బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

## అధికారులకు సమస్యలు పట్టవా


సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సమస్యలు రోజురోజుకూ పెరుగుపోతున్నాయని, వాటిని పరిష్కరించాల్సిన అధికారులు మాత్రం తూతూమంత్రంగా వింటున్నారే తప్ప పట్టించుకోవడం లేదని పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. విద్యుత్‌శాఖకు సంబంధించి గ్రామంలో గత కొన్ని నెలలుగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని, వాటిని సరిచేయాలంటూ విన్నవించినా పట్టించుకోవడం లేదని రాగోలు సర్పంచ్ గేదెల శంగల్వరావు విద్యుత్‌శాఖాధికారిని నిలదీశారు. అలాగే పెద గనగళ్లవానిపేట గ్రామంలో రొయ్యిలు చెరువులు కారణంగా గ్రౌండ్ వాటర్ పొల్యూషన్ జరిగి పలువురు వ్యాధుల బారిన పడుతున్నారని, సంబంధిత చెరువులకు కరెంట్ నిలుపుదల చేయాలని స్థానిక ఎంపీటీసీ ఎలక్ట్రికల్ ఏఈకు విన్నవించారు. అలాగే నైరా నుంచి అన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగు నీరు అందేలా చూడాలని పలువురు మండల పరిషత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ రుప్పదివ్య, ఎంపీడీవో బొడ్డేపల్లి శైలజ, ఏవో ఉమామహేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

### సత్తాచాటిన తన్యశ్రీ


టైటిల్ అందుకుంటున్న తన్యశ్రీ

శ్రీకాకుళం న్యూకాలనీ: బ్యాడ్మింటన్‌లో జిల్లాకు మరో చిచ్చరపిడుగు లభించింది. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ననుబోలు తన్యశ్రీ అదరహో అనిపించింది. జిల్లాలోని సోంపేట మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన 13 ఏళ్ల తన్యశ్రీ తాను ప్రాతినిధ్యం వహించిన రెండు విభాగాల్లోనూ ఛాంపియన్‌గా నిలిచి సత్తాచాటింది. అండర్-13 విభాగంలో సింగిల్స్‌లో ఛాంపియన్‌గా నిలవగా, అండర్-13 డబుల్స్‌లోను విజేతగా నిలిచింది. అలాగే బలమైన ఆటగాళ్లు కలిగిన అండర్-15 విభాగంలో సైతం తుది వరకు పోరాడి ఔరా అనిపించింది. ధీటైన క్రీడాకారులను మట్టి కరిపించి.. లీగ్స్, ప్రీక్వార్టర్స్, క్వార్టర్స్, సెమీస్, ఫైనల్స్ ఇలా అన్నింటి పోరాడి అండర్-15 బాలికల సింగిల్స్‌లోనూ విజయభేరి మోగించింది. ఇప్పటికే అనేక రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి బాడ్మింటన్ టోర్నీల్లో తన అద్భుతమైన ఆటతీరుతో రాణిస్తున్న తన్యశ్రీ సిక్కోలు భవిష్యత్ ఆశాకిరణమని చెప్పకతప్పదని జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు కొనియాడుతున్నారు.

### జాబ్‌మేళాకు అనూహ్య స్పందన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో 10 ప్రైవేటు కంపెనీలు పాల్గొన్నాయి. జిల్లా నలుమూలల నుంచి 475 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. అంతకుముందు జాబ్‌మేళా ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యువత లక్ష్య సాధన దిశగా చిత్తశుద్ధితో కష్టపడి పనిచేస్తే విజయం వరిస్తుందని పేర్కొన్నారు. జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ అధికారి పి.సాయికుమార్ మాట్లాడుతూ స్కిల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో జాబ్ మేళాలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, అధ్యాపకులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాధవరపు వెంకటేష్, ఉంగటి రమణమూర్తి, రెడ్డి గిరిజ శంకర్, వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

### అధ్వానంగా రహదారి

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని చేపల మార్కెట్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఈ రోడ్డు ఇలా గోతులమయంగా తయారవ్వడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నగరంలోని పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్‌లో సముద్రపు చేపలు, చెరువు చేపలు, రొయ్యలు తదితర వాటి కోసం నగరవాసులు వెళ్తుంటారు.

అలాగే ఈ చేపల మార్కెట్ వెనుక వర్తక, వాణిజ్య సముదాయం కూడా ఉంది. నిత్యం ఎంతోమంది కొనుగోలుదారులు ఈ మార్గం ద్వారానే వెళ్తుంటారు. దీంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.


గోతులమయంగా ఉన్న రహదారి

### ఉమారుద్రకోటేశ్వరునికి ప్రత్యేక అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో బలరామ ప్రతిష్ట దేవాలయమైన ఉమారుద్రకోటేశ్వరస్వామికి ఆషాఢ సోమవారం సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పూజలు చేశారు.

### దుండగులను కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు తదితరులు

జి.సిగడాం: మండలంలోని డీఆర్‌వలస గ్రామంలో ఈనెల 12న శనీశ్వరుడు ఆలయంలో విగ్రహాలను ధ్వంసం చేసినవారి కఠినంగా శిక్షించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాస సరస్వతీ స్వామి కోరారు. ఈ మేరకు ఆలయంలోని ధ్వంసమైన విగ్రహాల పరిస్థితిని సోమవారం పరిశీలించారు. పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. వీరుతోపాటు గ్రామ సర్పంచ్ కుమరాపు శ్రీనివాసరావు, ఎంపీటీసీ కుమరాపు రమేష్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, ఆలయ శిల్పి కుమరాపు రామినాయుడు తదితరులు ఉన్నారు.

### స్విమ్మర్ల జీవితాలతో ఆటలాడొద్దు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ స్విమ్మింగ్‌పూల్ మూసివేసి.. స్విమ్మర్ల జీవితాలతో ఆటలాడుకోవద్దని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు పవిత్ర, డి.చందులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళం శాంతినగర్ కాలనీలో ఉన్న డీఎస్‌ఏ స్విమ్మింగ్‌పూల్‌ను ఆగస్టు 10 నుంచి మూసివేయాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి విన్నవించారు. అక్టోబర్‌లో స్కూల్ గేమ్స్ పోటీలు జరగనుండగా, ఆగస్టులో స్విమ్మింగ్‌పూల్ మూసివేయడం వల్ల స్విమ్మింగ్ క్రీడాకారులకు తీవ్ర నష్టం వాటిళ్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారవుతుందని, ప్రభుత్వం పునః పరిశీలించాలని కోరారు. స్విమ్మింగ్ క్రీడాకారులు కొన్ని సంవత్సరాలుగా అధిక మొత్తంలో ఫీజులు చెల్లించి స్కూల్ గేమ్స్ కోసం ప్రాక్టీస్ చేస్తున్నారని, ఇప్పుడు మూసివేయడం వలన వాళ్లకు అన్యాయం జరుగుతుందన్నారు. అసలు ఉన్నట్టుండి మూసివేయాల్సిన అవసరం ఏమొచ్చిందో వివరణ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.

### సిక్కోలు హవా..!


రాణించిన బాడీ బిల్డర్లతో విజయ్, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు హవా కనబర్చారు. ఈనెల 13న తేదీన వైఎస్సార్ కడపలో జరిగిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన కె.దిలీప్ 50 కేజీల విభాగంలో ఐదో స్థానం, వైకుంఠరావు 55 కేజీల విభాగంలో నాలుగో స్థానం, దివాకర్ 60 కేజీల విభాగంలో ప్రథమ స్థానం, రాజు 90 కేజీల విభాగంలో రెండో స్థానం, కె.అవినాష్ మెన్స్ ఫిజిక్ విభాగంలో ప్రథమ స్థానం, శివ మెన్స్ ఫిజిక్ విభాగంలో రెండో స్థానం సాధించి సత్తాచాటారు. జిల్లాకు చెందిన బాడీ బిల్డర్లు సిక్కోలు ఖ్యాతిని చాటిచెప్పడం గర్వకారణంగా ఉందని స్టార్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీ వి.విజయకుమార్ అన్నారు. క్రీడాకారులకుతోపాటు వెన్నెంటే ఉంటూ విజయ్ ప్రోత్సహించారు. ది ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు, శంకర్, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

## అరసవల్లిలో టెండర్ల ప్రక్రియ పూర్తి

● పార్కింగ్ టెండర్ రూ.2.05 లక్షలకు ఖరారు
● పాదరక్షలు భద్రపరిచే హక్కుకు రూ.2.19 లక్షలు


వేలం నిర్వహిస్తున్న ఈవో ప్రసాద్, పక్కనే శంకరశర్మ తదితరులు

అరసవల్లి: ప్రసిద్ధ సూర్య దేవాలయంలో గతంలో ఎన్నడూ లేని పలు అంశాలకు టెండర్/బహిరంగ వేలం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు రానున్న ఏడాది పాటు హక్కులను కల్పించేలా టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. సోమవారం ఉదయం ఆలయ మండపంలో ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో రావివలస ఈవో గురునాథరావు సమక్షంలో జరిగిన ఈ టెండర్లకు నగరానికి చెందిన పలువురితో పాటు స్థానికులు కూడా హాజరయ్యారు. తొలిసారిగా ఆలయానికి ముందు ఖాళీ స్థలంతో పాటు ప్రధాన రహదారిలో ఉన్న పెద్దతోట, చిన్నతోటల్లో భక్తుల వాహనాల పార్కింగ్ హక్కులకు నిర్వహించిన వేలంలో అరసవల్లికి చెందిన ఐ.అనిల్ కుమార్ రూ.2.05 లక్షలకు గరిష్ఠంగా పాట ఖరారు చేసుకున్నారు. అలాగే ఆలయం ముందు భక్తుల పాదరక్షల భద్రపరిచే హక్కును ఎం.మనోజ్ రూ.2.19 లక్షల గరిష్ఠ పాటతో హక్కులను దక్కించుకున్నారు. ఇక ఆలయంలో నిత్యం జరిగే ఆర్జిత సేవలకు సాంప్రదాయ వస్త్రధారణ పంచెలు విక్రయించే హక్కులకై నిర్వహించిన వేలం తాత్కాలికంగా వాయిదా పడిందని ఈవో ప్రసాద్ ప్రకటించారు. ఇవేకాకుండా ఆలయంలో ఐరన్ స్క్రాప్, పూజా కలశాలు విక్రయించే హక్కు, ప్రసాదాలను ప్యాకింగ్ లేబర్, చింతపండు రసం చేసే లేబర్ తదితర అంశాలకు టెండర్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు మోసాలు ప్రజలకు వివరిద్దాం


బాబు షూరిటీ - మోసం గ్యారంటీ క్యూ ఆర్ పోస్టర్లు ప్రదర్శిస్తున్న నాయకులు

జి.సిగడాం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిద్దామని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ అన్నారు. మండలంలోని పెంట, నాగులవలస గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ ఆధ్వర్యంలో బాబు షూరిటీ – మోసం గ్యారంటీ, రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టోపై ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు.

నిరుద్యోగ యువత, మహిళలు, రైతులను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పున్నాన సోనియా, మాజీ ఎంపీటీసీ మీసాల శ్రీనివాసరావు, నాయకులు పున్నాన అక్కలనాయుడు, పున్నాన శ్రీనివాసరావు, బత్తుల చంద్రశేఖర్, పోలారావు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ


ఫరీదుపేటలో సత్తారు గోపి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రణస్థలం: ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట గ్రామంలో ఇటీవల హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సత్తారు గోపి కుటుంబ సభ్యులను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్ సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. గోపి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని తెలియజేశారు.

పరామర్శలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు బోర సాయిరామ్‌రెడ్డి, గొర్లె శ్రీనివాసరావు, డోల వెంకటరమణ, జి.సిగడాం ఎంపీపీ ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### ● గరిమెళ్లకు నివాళి


గరిమెళ్ల విగ్రహానికి నివాళులర్పిస్తున్న గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం నగరంలోని పలుచోట్ల స్వాతంత్ర్య సమరయోధుడు, సాహితీవేత్త గరిమెళ్ల సత్యనారాయణ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. గరిమెళ్ల జయంతిని ప్రభుత్వం అధికారకంగా నిర్వహించాలని కోరారు.

- సాక్షి నెట్‌వర్క్

### లోకాయుక్తలో ఫిర్యాదుపై పరిశీలన

జి.సిగడాం: మండల కేంద్రానికి చెందిన పి.జగదేశ్వరావు 92/8 సర్వే నెంబరులో ఉన్న భూమిని కొంతమంది ఆక్రమించి కల్యాణ మండపం నిర్మాణం చేపట్టారని, సర్వే చేసి వీటిని తొలిగించాలని ఇటీవల లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం కర్నూలు లోకాయుక్త అధికారి సమక్షంలో ఆ భూమిని అధికారులు పరిశీలించారు. మండల సర్వేయర్ చేపట్టిన సర్వే బాగు లేదుని, జిల్లా స్థాయి సర్వేయతో సర్వే చేపట్టాలని జగదేశ్వరరావు కోరారు. దీనిపై తహసీల్దార్ మహాదేవు సరిత జిల్లా ఉన్నత అధికారులకు సమాచారం అందిస్తామన్నారు. అనంతరం ఇరువర్గాల నుంచి వివరాలు సేకరించారు.

### సకాలంలో ఎరువులు అందిస్తాం

జి.సిగడాం: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులకు ఎరువులను సకాలంలో అందిస్తున్నామని మండల వ్యవసాయశాఖ అధికారి బెండి బాబ్జీ అన్నారు. మండలంలోని పెంట రైతు సేవా కేంద్రం ద్వారా రైతులకు ఎరువులను సోమవారం పంపిణీ చేశారు. రైతుకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పున్నాన సోనియా, పున్నాన అక్కలనాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ తలచింతల కుసుమ తదితరులు పాల్గొన్నారు.



## క్లుప్తంగా

### ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరరావు

రణస్థలం: మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన పురోగతి నమోదు వివరాలు స్పష్టంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీల పురోగతి సూచిక 2.0పై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలకు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్‌లో సూచించిన 163 ప్రశ్నలకు సరియైన వివరాలు నమోదు చేయాలని చెప్పారు. ఇలా నమోదైన వివరాలన్నీ క్రోడీకరించి పంచాయతీలకు ఉత్తమ అవార్డ్స్‌ను జిల్లా అధికారులు ప్రకటిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వి.ప్రకాశ్‌రావు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు ఎల్.అప్పన్న, రేవతి, ఎ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన హరికథ నవరత్నాలు


ఉషారాణిని సత్కరిస్తున్న సుమిత్రా సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళా మందిర్‌లో సుమిత్రా కళా సమితి ఆధ్వర్యంలో దివంగత పులఖండం శ్రీనివాసరావు స్మారకంగా నిర్వహిస్తున్న హరికథా నవరత్నల ప్రదర్శనలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా తిరుపతికి చెందిన మద్దిపట్ల ఉషారాణి భాగవతారిణి ని నవరత్నాల సెట్, దుశ్శాలువతో సత్కరించారు. పిదప శ్రీకృష్ణ రాయభారం కథను ఉషారాణి భాగవతారిణి చక్కగా వినిపించగా, వీరికి వయొలిన్‌పై మావుడూరు సత్యనారాయణశర్మ, వాయునందనరావు, మృదంగంపై మావుడూరు సూర్యప్రసాద్‌శర్మలు వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో సుమిత్రా కళా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు, బంకుపల్లి రమేష్‌శర్మ, పీఏఎస్ శాస్త్రి, రాజేశ్వరి, మెట్ట పోలినాయుడు, వీవీఆర్ మూర్తి, యు.పూజ, ఎం.రాజు, ఎం.వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ వ్యవస్థాపకుడు నంది ఉమాశంకర్ పుట్టిన రోజు పురస్కరించుకొని రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఎంసీ సభ్యుడు కల్యాణ్ చక్రవర్తి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పీఆర్వో పెంకి చైతన్య, బి.జగదీశ్, హర్ష, రక్తనిధి మేనేజర్ ఆయేషాబేగం, సతీష్, జి.రమణ, ఆదిత్యా డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ ఎంఎస్ గుప్తా, వీరఘట్టం శైల పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి సమీపంలోని పొన్నాడ బ్రిడ్జి ఒడ్డున ఉన్న ఇస్కాన్ జగన్నాథ మందిరం ఆధ్వర్యంలో ఇంటర్ స్కూల్ చిల్డ్రన్స్ కాంపిటేషన్ 80 అడుగుల రోడ్డులోని ఆనందమయి కన్వెన్షన్ హాల్‌లో సోమవారం జరిగింది. వాకస్పతి పేరుతో 'మానవతా విలువలు మరియు నైతిక విలువల ప్రాముఖ్యత' అనే అంశంపై డిబేట్ జరిగింది. దీనిలో 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇస్కాన్ నిర్వాహకురాలు లక్ష్మీపతిదాస్ మాట్లాడుతూ గెలిపొందిన విద్యార్థులకు ఆగస్టు 17న జరిగే కృష్ణాష్టమి వేడుకల సమయంలో బహుమతి ప్రధానం జరుగుతుందని పేర్కొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ప్రభుత్వ పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు వ్యవహరించారు.

### సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

శ్రీకాకుళం క్రైమ్: దేవాలయాలు, చర్చిలు, మసీదులు వంటి ప్రార్థనా మందిరాల్లో ఆయా కమిటీలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. జిల్లాలో 3,300 మందిరాలున్నాయని, వాటిలో కొన్నిచోట్లే సీసీ కెమెరాలు ఉన్నాయన్నారు. డి.ఆర్.వలసలో విగ్రహాల ధ్వంసం ఘటన దర్యాప్తు ఆ దేవాలయంలో కెమెరాలు లేకపోవడం వలనే ఆలస్యమైందన్నారు. శ్రీకాకుళం నగరంలో మసీదు గోడలపై రాతలకు సంబంధించి క్షణాల్లో నిందితులను సీసీఫుటేజీ ఆధారంగానే పట్టుకున్నామన్నారు. అంతేకాకుండా సోషల్ మీడియాలో మత విద్వేషాలు రగిల్చేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.